# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 17, జులై 2026


# సంక్షేమ పథకాలు అందరికీ చేరాలి




★ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సమీక్షలో చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశం

★ అట్రాసిటీ కేసుల విచారణ వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయాలని స్పష్టం

**నిర్మల్, జూలై 16, ప్రభాతవార్త:**

ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, రిజర్వేషన్ల అమలుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశానికి ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటాలకు చైర్మన్, కలెక్టర్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సంక్షేమ ఫలాలు ఆలస్యం లేకుండా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తు పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేసి బాధితులకు పరిహారం సకాలంలో చెల్లించాలని తెలిపారు. ప్రతి నెల చివరి వారంలో మండల స్థాయిలో మిగతా 2లో..





ఆదిలాబాద్‌లో నీటి పారుదల శాఖలో

# ఏసీబీ దాడులు

★ 60 వేలు లంచం తీసుకుంటూ ఇరిగేషన్ ఈఈ, ఏఈ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత

★ విమల పౌల్ట్రీ ఫామ్‌కు ఎన్‌ఓసీ కోసం రూ.60 వేల లంచం డిమాండ్

– ఆదిలాబాద్ వార్త ప్రతినిధి, జూలై 16, ప్రభాతవార్త 2లో..

అధికారుల జోక్యంతో

# బాల్య వివాహం నిలిపివేత

■ కుంటాలలో 14 ఏళ్ల బాలిక పెళ్లి అడ్డుకున్న అధికారులు

■ 18 ఏళ్లు నిండాకే పెళ్లి చేస్తామని తల్లిదండ్రుల నుంచి లిఖితపూర్వక హామీ

**నిర్మల్, జులై 16, ప్రభాతవార్త:**

కుంటాల మండలంలోని ఓ గ్రామంలో 14 ఏళ్ల బాలికకు జరగనున్న బాల్య వివాహాన్ని అధికారులు సమయానికి స్పందించి అడ్డుకున్నారు. విశ్వసనీయ సమాచారం అందడంతో జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు గురువారం గ్రామానికి వెళ్లారు. అక్కడ బాలిక కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, మానసిక ఎదుగుదలపై పడే దుష్ప్రభావాలను అధికారులు స్పష్టంగా వివరించారు. బాల్య వివాహ నిరోధక చట్టం2006 ప్రకారం బాల్య వివాహాలు జరిపిస్తే ఎదురయ్యే మిగతా 2లో..



# చామనపల్లిలో పోడు భూముల వివాదం ఉద్రిక్తం

● రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం

● హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు

● జాయింట్ సర్వేతో సమస్య పరిష్కరిస్తామని అధికారుల హామీ



**వేమనపల్లి, జూలై 16, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం చామనపల్లిలో పోడు భూముల వివాదం గురువారం ఉద్రిక్తంగా మారింది. అటవీ శాఖ ప్లాంటేషన్ పనులను అడ్డుకున్న రైతులు, అధికారులతో వాగ్వాదానికి దిగగా, ఈ క్రమంలో నూకల తిరుపతి అనే రైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్రమత్తమైన గ్రామస్తులు వెంటనే అతడిని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాల ప్రకారం, చామనపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 67, అటవీ శాఖ రికార్డుల ప్రకారం చెన్నూరు రిజర్వ్ ఫారెస్ట్ కాంపార్ట్‌మెంట్-125 పరిధిలో అటవీ అధికారులు మిగతా 2లో..



# సంక్షేమ పథకాలు అందరికీ చేరాలి

**(మొదటిపేజీ తరువాయి)**

సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ప్రతి మూడు నెలలకొకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం తప్పనిసరిగా జరపాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి పని దినాలు కల్పించాలని, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధులు పెండింగ్‌లో ఉంటే ముఖ్యమంత్రితో మాట్లాడి విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలో సంక్షేమ పథకాలు సమర్థంగా అమలవుతున్నాయని తెలిపారు. విద్యార్థులకు కామన్ మెనూ, ఉపకార వేతనాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 4,306 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, ఉపాధి హామీ పథకంలో ఎస్సీ, ఎస్టీ కూలీలకు ఉపాధి కల్పనలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు. బ్యాంకుల ద్వారా 199 ద్విచక్ర, త్రిచక్ర విద్యుత్ వాహనాలు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. నమోదైన అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగంగా కొనసాగుతోందని, వివిధ దశల్లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లోని ఎస్సీ, ఎస్టీ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై దృష్టి పెట్టాలని, 60 ఏళ్లు పూర్తి చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని కమిషన్ సభ్యులు సూచించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కుస్త్రం నీలాదేవి, రాంబాబు నాయక్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్‌లో నీటి పారుదల శాఖలో
# ఏసీబీ దాడులు

**ఆదిలాబాద్ వార్త ప్రతినిధి, జూలై 16, ప్రభాతవార్త**

ఆదిలాబాద్ జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. సొనాల మండలానికి చెందిన చౌహాన్ విక్రమ్ సింగ్ నుంచి రూ.60 వేల లంచం తీసుకుంటుండగా నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాథోడ్ విటల్, అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. చౌహాన్ విక్రమ్ సింగ్ తన విమల పౌల్ట్రీ ఫామ్ ఏర్పాటుకు అవసరమైన ఇరిగేషన్ శాఖ నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌ఓసీ) కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎన్‌ఓసీ జారీ చేసేందుకు అధికారులు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్ని, ఆదిలాబాద్‌లోని నీటిపారుదల శాఖ కార్యాలయంలోనే లంచం స్వీకరిస్తుండగా ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకుని, రసాయన పరీక్షలు నిర్వహించారు. ఈ ఘటనతో జిల్లా నీటిపారుదల శాఖలో కలకలం రేగింది. కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

## మారుమూల గ్రామాల సంకల్పయాత్రను విజయవంతం చేయండి

**- నౌండ్ల సంతోష్ చారి**

**వాంకిడి, జూలై 16, ప్రభాతవార్త**

కొమరం భీమ్ జిల్లా వాంకిడి మండలంలోని ఇందాని మారుమూల గ్రామంలో విశ్వకర్మ సంకల్పయాత్ర నిర్వహించారు ఈ సందర్భంగా సంతోష్ చారి మాట్లాడుతూ ప్రతి మారుమూల గ్రామానికి వెళ్లి విశ్వకర్మల బాగోగులు అడిగి తెలుసుకుంటానని, యువతను సంఘ బలోపేతానికి కృషి చేయాలని కోరారు విశ్వకర్మల కులవృత్తులు అంతరించిపోకుండా మెరుగైన యంత్రాలను కొనుగోలు చేసి మంచి నైపుణ్యత కలిగి ఉండాలని అన్నారు ప్రతి ఒక్కరూ సంఘ బలోపేతానికి కృషి చేసి ఐక్యతగా ఉన్నప్పుడే ఎదుటివారు మనపై దాడికి కానీ మనపై విరోధానికి రాకుండా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు కిరిమిళ్ళ వినోద్ చారి, తోమోజు సంతోష్ చారి, రాధాకృష్ణ చారి, వేణుగోపాల్ చారి, రవీందర్ చారి, కమలాకర్ చారి, మండల నాయకులు రాములు చారి, పెంటయ్య చారి, గోవర్ధన్ చారి, మొండయ్య చారి, వెంకటరమణాచారి, తదితరులు పాల్గొన్నారు.





## సమస్యలు పరిష్కరించకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం

**ఆసిఫాబాద్, జులై 16, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెలరోజుల్లోపు అమలు చేయని పక్షంలో అచలపక్షం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ను ముట్టడి నిర్వహిస్తామని బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరిగెల నాగేశ్వర్రావ్, సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణలు స్పష్టం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతు ఎల్నినో ప్రభావంతో పంటలకు సాగు నీటి కొరత లేకుండా పక్క రాష్ట్రంలో రైతులకు నీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లుగా తెలంగాణాలో కూడా రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వందల కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన అడ ప్రాజక్టు ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు వట్టివాగు కాలువల మరమ్మత్తుల కోసం గత 3 సంవత్సరాల క్రితం రూ.150 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు విడుదల చేయకపోవడం రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే చెందుతున్నాయని, అక్కడక్కడ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావాలంటే ఒక్కో ఇంటికి రూ.50 వేలు కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. నెల రోజుల్లో రైతుల సమస్యలు పరిష్కరించని పక్షంలో అచలపక్షం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఓబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, నాయకులు మల్లికార్జున్ రావ్, జాడె అశోక్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఇంటికీ నల్లా నీరు..

**- బారెగూడకు 100 హర్ ఘర్ జల్ ధ్రువీకరణ**

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 16, ప్రభాతవార్త :**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని బారెగూడ గ్రామపంచాయతీ స్వచ్ఛమైన తాగునీటి సరఫరాలో మరో మైలురాయిని చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న హర్ ఘర్ జల్ కార్యక్రమం కింద గ్రామంలోని ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా 100 శాతం నల్లా నీటి సరఫరా జరుగుతున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ మేరకు మిషన్ భగీరథ ఇంట్రా డీఈ రాజేష్, ఏఈ సాయి కృష్ణ గ్రామపంచాయతీకి 100 శాతం హర్ ఘర్ జల్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేయగా, గ్రామ సర్పంచ్ కోట వేణుగోపాల్ దానిని స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోట వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీటిని నిరంతరం అందించడం గ్రామపంచాయతీ ప్రధాన లక్ష్యమని అన్నారు. హర్ ఘర్ జల్ లక్ష్య సాధనలో మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు అందించిన సహకారం అభినందనీయమని పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## అధికారుల జోక్యంతో
# బాల్య వివాహం నిలిపివేత

**(మొదటిపేజీ తరువాయి)**

చట్టపరమైన తీవ్ర పరిణామాలను తెలియజేశారు. అధికారుల కౌన్సెలింగ్‌తో తమ తప్పు తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, కుమార్తెకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేస్తామని లిఖితపూర్వకంగా హామీ పత్రం రాసిచ్చారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. చట్ట ప్రకారం అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండకుండా వివాహం చేయడం తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు నిర్వహించినా లేదా ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్-1098 సంఖ్యకు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి మురళి, సూపర్వైజర్ శ్రీజని, కౌన్సెలర్లు శైలజ, కరుణశ్రీ, ఇతర శాఖల అధికారులు, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చామనపల్లిలో పోడు భూముల వివాదం ఉద్రిక్తం

**(మొదటిపేజీ తరువాయి)**

ప్లాంటేషన్ పనులు చేపట్టగా, రైతులు వాటిని అడ్డుకున్నారు. ఈ భూములను తాము ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, గతంలో ప్రభుత్వం పట్టాలు కూడా పంపిణీ చేసిందని పేర్కొంటూ మొక్కలు నాటవద్దని అధికారులను కోరారు. దీంతో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, అధికారులు పనులు నిలిపి వేసి వెళ్లిపోయారు. గురువారం చెన్నూరు ఫారెస్ట్ డివిజన్ అధికారి సర్వేశ్వరరావు, నిల్వాయి అటవీ క్షేత్రాధికారి హాఫీజొద్దీన్, చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ, నీల్వాయి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తదితర అధికారులు మళ్లీ ఘటనాస్థలికి చేరుకున్నారు. రైతులు, అధికారుల మధ్య మరోసారి వాగ్వాదం జరుగుతుండగా నూకల తిరుపతి పురుగుల మందు సేవించాడు. అనంతరం జరిగిన చర్చల్లో, రెవెన్యూ-అటవీ శాఖల సంయుక్త సర్వే నిర్వహించి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూ సమస్యకు పరిష్కారం చూపిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది. దీంతో రైతులు, అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలపై అధికారులు నిర్లక్ష్యం వీడాలి: పీఎస్‌యూ

**ఆసిఫాబాద్, జులై 16, ప్రభాతవార్త:**

జిల్లాలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కోట ఆనంద్ ఆరోపించారు. విద్యార్థులకు నాసిరకం భోజనం అందిస్తున్నారంటూ గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, సంబంధిత అధికారులు హాస్టళ్లను నిత్యం పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, వసతి తదితర కనీస మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో చోటుచేసుకున్న ఘటనలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలలు, ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కోట ఆనంద్

# స్కంద ఔట్ ఫిట్ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

**- విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులు నాణ్యవంతంగా తయారు చేయాలి**

**- నిర్దేశిత సమయంలోగా యూనిఫాంలు అందించాలని అధికారులకు ఆదేశం**

**నిర్మల్, జులై 16, ప్రభాతవార్త:**

ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులు (యూనిఫాంలు) అత్యంత నాణ్యవంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం నిర్మల్ పట్టణంలోని స్కంద ఔట్ ఫిట్ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం చేపడుతున్న దుస్తుల తయారీ తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా దుస్తుల తయారీ, కుట్టు పనికి సంబంధించిన వివరాలను నిర్వాహకులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందజేసే యూనిఫాంల నాణ్యతలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. నిర్దేశిత సమయానికి దుస్తుల తయారీని పూర్తి చేసి విద్యార్థులకు సకాలంలో అందజేయాలని సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) భోజన్న, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## నూతన పంచాయతీ కార్యదర్శికి సన్మానం

**జెవిలి జీపీలో బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శి.. సత్కరించిన పాలకవర్గం**

**అందరి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తా: పంచాయతీ కార్యదర్శి**

**సారంగాపూర్, జులై 16, ప్రభాతవార్త:**

మండలంలోని జెవిలి గ్రామపంచాయతీకి బదిలీపై వచ్చిన నూతన గ్రామ పంచాయతీ కార్యదర్శిని సర్పంచ్ కొమ్ము సురేందర్, ఉప సర్పంచ్ కోటగిరి లక్ష్మి, రేషన్ డీలర్ ఏవుడి భూమేష్, గ్రామ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం నూతన కార్యదర్శి మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి పాలకవర్గం, గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో శ్రమిస్తానని తెలిపారు. జెవిలి గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : సీఐ

**- కీర్గుల్ (కె) గ్రామంలో ఘనంగా వనమహోత్సవం..**

**మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు**

**- భావితరాల భవిష్యత్తు కోసం మొక్కలను సంరక్షించాలి**

**భైంసా, జులై 16, ప్రభాతవార్త:**



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాసర సీఐ దీపక్ పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా బాసర మండల పరిధిలోని కీర్గుల్ (కె) గ్రామంలో సర్పంచ్ మధుప్రీతి ఆధ్వర్యంలో గురువారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ దీపక్ ముఖ్య అతిథిగా హాజరై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సంఘమిత్రతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ దీపక్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో మొక్కలు ఎంతో కీలకమైనవని, భావితరాల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. సర్పంచ్ మధుప్రీతి మాట్లాడుతూ.. ఇళ్ల ఆవరణతో పాటు వ్యవసాయ పొలాల్లో మొక్కలు నాటి కాపాడడం వల్ల పర్యావరణ సమతుల్యత ఏర్పడి సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్యామ్యూల్, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాళీమాత ఆషాఢ బోనాల జాతరకు ఘనంగా పోస్టర్ల ఆవిష్కరణ

**- ఈ నెల 19న ఫలహార బండి ఊరేగింపు**

**- కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో వైభవంగా జాతర నిర్వహణ**

**మంచిర్యాల, జూలై 16, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో, శ్రీ కాళీమాత అఘోరి రఘు గురు స్వామి ఆశీస్సులతో ఈ నెల 19న నిర్వహించనున్న కాళీమాత ఆషాఢ మాస బోనాల జాతర సందర్భంగా బోనాల పోస్టర్లను కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖమ్మ చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. అదే రోజు కార్పొరేటర్ నల్ల శంకర్ నివాసం ఎదుట నుంచి ఫలహార బండి ఊరేగింపు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వడ్డే రాజమౌళి, కార్పొరేటర్లు నల్ల శంకర్, గంగవరపు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముని అన్న, కుమ్మరి సంఘం నాయకులు నాగపురి ప్రసాద్, తడిగొప్పుల లక్ష్ముణ్, ఇజ్జగిరి రామస్వామి, ఇజ్జగిరి శంకర్, ఇజ్జగిరి తిరుపతి, కొత్తపల్లి శ్రీనివాస్, పెండ్యాల కుమారస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాతరను భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కుమ్మరి సంఘం నాయకులు పిలుపునిచ్చారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం



## వర్షాల కోసం అడెల్లి పోచమ్మకు చల్ల సమర్పణ

**- కౌట్ల(బి) గ్రామంలో ఘనంగా పండగ వాతావరణం..**

**పాదయాత్రగా తరలిన మహిళలు**

**సారంగాపూర్, జులై 16, ప్రభాతవార్త:**

సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ సారంగాపూర్ మండలం కౌట్ల(బి) గ్రామంలో మహిళలంతా అడెల్లి పోచమ్మ అమ్మవారికి శోభాయమానంగా చల్ల సమర్పించారు. తరతరాలుగా వస్తున్న ఆచారంలో భాగంగా గురువారం ఉదయాన్నే గ్రామానికి చెందిన వందలాది మంది స్త్రీలు బోనాలు ఎత్తుకుని, వాటిలో చల్లను నింపుకుని తలపై పెట్టుకుని ఊరేగింపుగా బయలుదేరారు. గ్రామం నుండి అమ్మవారి ఆలయం వరకు పాదయాత్రగా వెళ్లి పోచమ్మ తల్లికి చల్లను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. కాలం అనుకూలించి సకాలంలో వర్షాలు పడనప్పుడు ఈ విధంగా అమ్మవారికి చల్ల సమర్పిస్తే వర్షాలు కురుస్తాయని తమ ప్రగాఢ నమ్మకమని తెలిపారు. గ్రామాన్ని, ప్రజలను చల్లగా చూసే అడెల్లి పోచమ్మ తల్లి తమ మొక్కులను స్వీకరించి ఎలాంటి కరువు కాటకాలు రాకుండా కాపాడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అమ్మవారిపై నమ్మకంతో ప్రతి ఏటా ఈ వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నాయకుల ప్రత్యేక చర్చ

**- 100 శాతం ఓటరు నమోదు చేపట్టాలి: మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి**

**- నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులకు ఘన సన్మానం**

**భైంసా, జులై 16, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు అందుబాటులో ఉండి 100 శాతం ఓటరు నమోదు అయ్యేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదయ్యేలా చూడాలని సూచించారు.అనంతరం నూతనంగా నియమితులైన కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముత్త గౌడ్ (లోకేశ్వరం), మహిపాల్ రెడ్డి (కుబేర్), షిండే గజానన్ (భైంసా రూరల్)లను విఠల్ రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుల నియామకానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జులకు ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తరఫున విఠల్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తాటి, ఈత చెట్ల వనం ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**చెట్లను నరికివేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు: ఎక్సైజ్ సీఐ రంగస్వామి హెచ్చరిక**

**సారంగాపూర్, జులై 16, ప్రభాతవార్త:**



సారంగాపూర్ మండల కేంద్రంలో తాటి, ఈత చెట్ల వనాన్ని ధ్వంసం చేసిన ఘటనపై ఎక్సైజ్ అధికారులు వేగంగా స్పందించి చర్యలు చేపట్టారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు, చెట్లను నరికివేసిన కుమ్మరి నర్సయ్యను అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ రంగస్వామి మాట్లాడుతూ.. తాటి, ఈత చెట్లను నరికివేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హరితహారంలో భాగంగా తాటి, ఈత చెట్లను నాటి వనాలను అభివృద్ధి చేస్తోందని, వీటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా గీత వృత్తిదారుల సంఘాలు వీటిని కాపాడుకోవాలని సూచించారు. నిందితుడిని విచారించి కేసు నమోదు చేశామని, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి మరిన్ని వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై అభిషేక్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## చెన్నూరు మున్సిపల్ నూతన కమిషనర్‌గా మారుతి ప్రసాద్

చెన్నూరు, జూలై 16, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా మారుతి ప్రసాద్ గురువారం రోజు పదవీ బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ పాలకవర్గం సభ్యులు ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా వ్యాధుల పట్ల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా కార్యాలయం వద్దకు వచ్చి చెప్పుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పట్టణ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



## కొత్తపల్లి శివారు భూముల రీసర్వే ప్రారంభం

### జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే ప్రక్రియకు శ్రీకారం

వేమనపల్లి, జూలై 16, ప్రభాతవార్త

వేమనపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారు భూముల రీసర్వే ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ డైరెక్టర్ (సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్) శ్రీనివాస్ ఆధ్వర్యంలో రీసర్వే పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్. సాయికృష్ణ, కొత్తపల్లి సర్పంచ్ మడే శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్, సర్వే బృందం సభ్యులు, మండల నాయకులు, గ్రామస్తులు, కొత్తపల్లి శివారు రైతులు పాల్గొన్నారు. రీసర్వే ప్రక్రియకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని అధికారులు కోరారు. సర్వే ద్వారా భూ రికార్డులను కచ్చితత్వంతో రూపొందించి, భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### గురుకులాల్లో కొలువుల సందడి..

## 40 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

### - జులై 23 వరకు దరఖాస్తులు.. జులై 25, 27 తేదీల్లో

### బోధన ప్రదర్శన ఆధారంగా ఎంపిక

మంచిర్యాల, జులై 16, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లాలోని 9 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 40 తాత్కాలిక బోధనా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయకర్త కోటూరి రామకళ్యాణి తెలిపారు. జూనియర్ లెక్చరర్, పి.జి.టి., టి.జి.టి., ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు జులై 23 సాయంత్రం 4 గంటలలోపు లక్షెట్టిపేట గురుకుల బాలికల పాఠశాల-కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జూనియర్ లెక్చరర్, పి.జి.టి. పోస్టులకు జులై 25న, టి.జి.టి., ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులకు జులై 27న బోధన ప్రదర్శన నిర్వహించి ఎంపిక చేపట్టనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పూర్తి బయోడేటా, విద్యార్హతల అసలు ధ్రువపత్రాలు, నకలు ప్రతులతో హాజరు కావాలని సూచించారు. బాలికల విద్యాసంస్థల్లోని పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని, ఎంపిక కమిటీ నిర్ణయం మేరకు ఖాళీల్లో మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు.

# వర్షాకాలానికి ముందస్తు సన్నద్ధత..

### ఔషధ నిల్వలపై జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ - ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర మందులు, పాము-కుక్క-తేలు కాటు చికిత్స ఔషధాలు

### జ్వరాలు-అతిసార నివారణ మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి: డాక్టర్ నరేందర్ రాథోడ్

మంచిర్యాల, జూలై 16, ప్రభాతవార్త



ఔషధ నిలువలు తనిఖీ చేస్తున్న దృశ్యం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, కార్యక్రమ అధికారి డాక్టర్ అనిల్ రావుతో కలిసి జిల్లా కేంద్ర ఔషధ నిల్వ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, మాతా-శిశు సంరక్షణ కేంద్రాలు, తెలంగాణ నిర్ధారణ కేంద్రాలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, అత్యవసర వైద్య విభాగాలకు అవసరమైన మొత్తం మూడు వందల యాభై రెండు రకాల మందుల నిల్వలు, సరఫరా వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు, అతిసారం, వాంతులు, విరోచనాలకు అవసరమైన మందులతో పాటు నోటి ద్వారా ఇచ్చే ద్రావణం, పాము, కుక్క, తేలు కాట్ల చికిత్సకు అవసరమైన ఔషధాలు అన్ని వైద్య కేంద్రాల్లో తగినంత నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మందుల గడువు తేదీలను నిరంతరం పరిశీలిస్తూ, రోజువారీ నిల్వ వివరాలను నమోదు చేయాలని, వ్యాక్సిన్ శీతల నిల్వ వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, మార్గాల వారీగా మందుల సరఫరా చేపట్టాలని, అత్యవసర ఔషధాలు ప్రతి ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. తనిఖీలో ఔషధ నిల్వల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఔషధాధికారి శ్రీవాణి, ఔషధ అధికారులు చంద్రయ్య, శ్రీనివాస్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, మలేరియా విభాగ అధికారులు శ్రీనివాస్, రవికిరణ్, కేంద్ర ఔషధ నిల్వ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ రెయిన్‌బో పాఠశాలకు సావిత్రిబాయి పూలే చిత్రపటం బహూకరణ

నస్పూర్, జూలై 16, ప్రభాతవార్త



నస్పూర్‌లోని శ్రీ రెయిన్‌బో పాఠశాల యాజమాన్యానికి పాఠశాల పూర్వ విద్యార్థులు సావిత్రిబాయి పూలే చిత్రపటాన్ని గురువారం బహుకరించారు. పూర్వ విద్యార్థులైన ఆధ్యాన్ష్ హయాన్, అనంత్ విహాన్ తమ తండ్రి యుగేందర్ సాయితో కలిసి ఈ చిత్రపటాన్ని పాఠశాల డైరెక్టర్ అమన్ ప్రసాద్, ఉపాధ్యాయులకు అందజేశారు. తమ పిల్లలు మంచిర్యాల కార్మెల్ కాన్వెంట్ (సీబీఎస్ఈ) స్కూల్‌లో చేరిన సందర్భంగా, ఇన్నాళ్లూ తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి వారి అభివృద్ధికి కృషి చేసినందుకు కృతజ్ఞతగా ఈ బహుమతిని అందించినట్లు యుగేందర్ సాయి తెలిపారు. భారతదేశ చరిత్రలో విద్య ద్వారా చైతన్యం తెచ్చిన సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే పోరాటం, త్యాగాలు ఎనలేనివని ఈ సందర్భంగా యుగేందర్ సాయి పేర్కొన్నారు. నేటి సమాజంలో విద్యాభివృద్ధికి వారు వేసిన మొదటి అడుగులే నేడు మనకు పాఠశాలల రూపంలో కనిపిస్తున్నాయన్నారు. ఆ మహనీయుల ఆశయాలకు ప్రతీకగా తమ పిల్లలతో కలిసి పాఠశాల డైరెక్టర్‌కు, ఉపాధ్యాయ బృందానికి ఈ చిత్రపటాన్ని అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విశ్వనాథ ఆలయ చైర్మన్ పదవి బీసీలకే కేటాయించాలి

### సామాజిక న్యాయం, సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కలెక్టర్‌కు బీసీ సమాజ్ వినతి

మంచిర్యాల, జూలై 16, ప్రభాతవార్త



మంచిర్యాల పట్టణంలోని శ్రీ విశ్వనాథ ఆలయ పాలకమండలి చైర్మన్ పదవిని బీసీ సామాజిక వర్గానికి కేటాయించి, పాలకమండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలు తదితర వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆలయ పాలకమండలి చైర్మన్ పదవి ఎన్నో సంవత్సరాలుగా ఒకే సామాజిక వర్గానికే పరిమితమవడం సామాజిక న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. అత్యధిక జనాభా కలిగిన బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాలకు కూడా నాయకత్వ అవకాశాలు కల్పించాలని కోరారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సమాన అవకాశాలు, పారదర్శకతతో నియామకాలు చేపట్టి, రానున్న పాలకమండలిలో చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొలిశెట్టి లక్ష్మణ్, జిల్లా నాయకులు పెద్దపెల్లి సూరయ్య, చల్ల విజయ్ కుమార్, కొండ రాజు, కుడుక మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గోడలకే పరిమితమైన మెనూ బెల్లంపల్లి ఆస్పత్రిలో భోజనాలపై ఫిర్యాదు

బెల్లంపల్లి, జూలై 16, ప్రభాతవార్త

బెల్లంపల్లి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఆరోపిస్తూ, ఎం.సి.పి.ఐ.యు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ ఆసుపత్రి సూపరిండెంట్ రవికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గానికి ప్రధాన వైద్య కేంద్రంగా ఉన్న ఈ ఆసుపత్రికి ఏడు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారని తెలిపారు. అయితే, ఆసుపత్రిలో అమలు చేయాల్సిన మెనూ కేవలం గోడలపైనే పరిమితమైందని, వాస్తవంగా రోగులకు అందడం లేదని విమర్శించారు. ఉదయం అల్పాహారం అందించడం లేదని, మెనూలో ఉన్న ఇడ్లీ, పొంగల్, ఉప్మా, బ్రెడ్ ముక్కలు, కాచిన పాలు వంటి పదార్థాలు రోగులకు అందడం లేదన్నారు. అలాగే మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు, అరటిపండు, పెరుగు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అవి కూడా అందించకపోవడం బాధాకరమని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న రోగుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, వెంటనే మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బాధ్యులైన కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకుని, అవసరమైతే కొత్త కాంట్రాక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. రోగుల ఆరోగ్యం దృష్ట్యా పోషకాహారం అందించడం అత్యంత కీలకమని, అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



# ముందస్తు గుర్తింపే మహారక్షణ.. హెచ్ఐవీ నియంత్రణపై జిల్లాలో ముమ్మర చర్యలు

## ఇంకా 436 మందిని గుర్తించడమే లక్ష్యం.. ఉచిత పరీక్షలు, చికిత్సను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా వైద్యాధికారి పిలుపు

**మంచిర్యాల, జూలై 16, ప్రభాతవార్త**



జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణ, బాధితులకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు ముమ్మరం చేసింది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో హెచ్ఐవీ వ్యాధి నిర్మూలనకు నిర్దేశించిన అంతర్జాతీయ లక్ష్యాల సాధనపై సమగ్రంగా చర్చించారు. ప్రస్తుతం జిల్లాలో 2,064 మంది బాధితులు ఉచిత చికిత్స పొందుతున్నారని, వారిలో దాదాపు అందరికీ వైరల్ లోడ్ పరీక్షలు పూర్తయ్యాయని తెలిపారు. తొలి దశ లక్ష్యాన్ని చేరుకోవాలంటే మరో 436 మంది బాధితులను గుర్తించాల్సి ఉందని పేర్కొంటూ గ్రామీణ, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పరీక్షా శిబిరాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షలు, చికిత్స పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, వ్యాధిని ముందుగానే గుర్తిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని ప్రజలు స్వచ్ఛందంగా పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి పిలుపునిచ్చారు.



## ఎన్యుమరేషన్ ఫారాల ఆన్‌లైన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

- బీఎల్ఓ యాప్ పనితీరు పరిశీలన..
- ఓటర్ల జాబితా సవరణపై కలెక్టర్ భవేశ్ మిశ్రా సమీక్ష
- జాప్యం లేకుండా పారదర్శకంగా పనులు ముగించాలని అధికారులకు ఆదేశం

**సారంగాపూర్, జులై 16, ప్రభాతవార్త:**

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా జిల్లాలో పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం భైంసా పట్టణంతో పాటు నిర్మల్ పట్టణంలోని 24వ వార్డులో కొనసాగుతున్న ఎస్ఐఆర్ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంపిణీ చేసిన ఫారాల వివరాలు, ఆన్‌లైన్ నమోదు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి జాప్యం లేకుండా మొత్తం ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మల్‌లో పర్యటించిన సందర్భంగా బీఎల్ఓ యాప్ పనితీరును పరిశీలించి, ఆన్‌లైన్ ఎంట్రీలపై ఆరా తీశారు. స్థానిక ఓటర్లతో మాట్లాడి ఎస్ఐఆర్ ఫారాలను సక్రమంగా పూర్తి చేసి వెంటనే బీఎల్ఓలకు అందజేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి కుటుంబం నుండి సమాచారాన్ని సేకరించాలని, అర్హులైన లబ్ధిదారులెవరూ మిగిలిపోకూడదని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, తహసిల్దార్లు శశిభూషణ్, రాజు, ఎంపీడీవో నీరజ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సృజనాత్మక బోధనతో విద్యార్థుల్లో భాషాభిమానాన్ని పెంపొందించాలి: జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య

**మంచిర్యాల, జూలై 16, ప్రభాతవార్త**

తెలుగు భాషను కేవలం పాఠ్యాంశంగా కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతీకగా భావించి విద్యార్థులకు బోధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ నిర్వహించిన తెలుగు భాషా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న వినూత్న బోధనా పద్ధతులను పాఠశాలల్లో అమలు చేసి విద్యార్థుల్లో తెలుగు భాషపై ఆసక్తి, అభిరుచిని పెంపొందించాలని అన్నారు. ఇతర భాషల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో కథలు, కవితలు, పద్యాలు, నాటికల ద్వారా సృజనాత్మకంగా బోధించి విద్యార్థుల భాషా నైపుణ్యాలను మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోర్సు సమన్వయకర్త జంబోజు సత్తయ్య, శిక్షణ కేంద్ర ఇన్‌చార్జి బోనగిరి శ్రీనివాస్, జిల్లా స్థాయి వనరుల బృంద సభ్యులు, తెలుగు భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అటవీ అధికారుల వేధింపులతోనే రైతు ఆత్మహత్యాయత్నం: కొయ్యల ఏమాజి

### బాధ్యులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్

**వేమనపల్లి, జూలై 16, ప్రభాతవార్త**



వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామానికి చెందిన రైతు నూకల తిరుపతి ఆత్మహత్యాయత్నానికి అటవీశాఖ అధికారుల వేధింపులే కారణమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జడ్పీటీసీల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యులైన అటవీశాఖ అధికారులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నూకల తిరుపతిని ఏమాజి పరామర్శించి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతును సాగు చేయకుండా అడ్డుకోవడం, భూమిపై వేధింపులకు గురి చేయడం వల్లే మనస్తాపానికి గురైన తిరుపతి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని అన్నారు. ఈ ఘటనకు కారణమైన అధికారులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పోడు భూముల సమస్యను రైతులకు అనుకూలంగా పరిష్కరించాలని, అటవీశాఖ అధికారులు తమ వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు. లేకపోతే రైతుల తరపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

## బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీతో పాటు ఉద్యోగం

**బెల్లంపల్లి, జూలై 16, ప్రభాతవార్త**

ప్రస్తుత కాలంలో డిగ్రీలు పూర్తిచేసినా ఉద్యోగం దొరకడం కష్టంగా మారిన పరిస్థితుల్లో, బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులకు వినూత్న అవకాశాన్ని అందిస్తోంది. డిగ్రీ చదువుతో పాటు ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తూ, చదువు పూర్తయ్యే సరికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఏఈడిపి కోర్సులను ప్రవేశపెట్టింది. ఈ కోర్సులు ఒకప్పుడు నగర ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉండగా, ఇప్పుడు బెల్లంపల్లి వంటి ప్రాంతంలో అందించడం విశేషంగా మారింది. ముఖ్యంగా గ్రామీణ, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఇవి ఉపాధి దిశగా బలమైన మార్గాన్ని చూపుతున్నాయి. కళాశాలలో ప్రస్తుతం ఐదు ప్రధాన ఏఈడిపి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో బిఏ హానర్స్, బీకాం (బిఎఫ్ఎస్ఐ), బీకాం (ఈకామర్స్), బి.ఎస్సీ ఫిషర్స్ అండ్ ఆక్వాకల్చర్, బిఎస్సీ హార్టికల్చర్ అండ్ ల్యాండ్ స్కాపింగ్ ఉన్నాయి. ప్రతి కోర్సు విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్యాలు అందిస్తూ, సంబంధిత రంగాల్లో ఉద్యోగ అవకాశాలను పెంచేలా రూపొందించబడింది. ఈ కోర్సుల ముఖ్య ప్రత్యేకత ఏమిటంటే మొదటి రెండు సంవత్సరాలు కళాశాలలో సిద్ధాంతపరమైన బోధన ఉండగా, చివరి సంవత్సరం సంబంధిత సంస్థల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వడం. ఈ శిక్షణ సమయంలో విద్యార్థులకు స్టైపండ్ కూడా అందించబడుతుంది. దీంతో విద్యార్థులు చదువుతో పాటు అనుభవాన్ని కూడా సంపాదించగలుగుతారు. బిఏ హానర్స్ కోర్సు ద్వారా ఆర్ట్స్ విద్యార్థులు ఒక సబ్జెక్టులో లోతైన పరిజ్ఞానం సంపాదించి యుపిఎస్సి, గ్రూప్ 1 వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవ్వగలరు. బీకాం (బిఎఫ్ఎస్ఐ) కోర్సు బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాల్లో త్వరిత ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. అలాగే బీకాం (ఈకామర్స్) ద్వారా ఈకామర్స్ రంగంలో ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయి. ఈ కోర్సులు లైఫ్ సైన్స్ విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలను అందిస్తూ, వ్యవసాయ మరియు అనుబంధ రంగాల్లో ఉపాధికి దోహదపడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ ఈ కోర్సులను ఉపాధి ప్రధాన లక్ష్యంగా ప్రవేశపెట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటోంది. డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగం పొందే విధంగా వ్యవస్థను రూపొందించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇదిలా ఉండగా, కళాశాలలో గత ఐదేళ్లుగా అందిస్తున్న బీకాం టాక్సేషన్ కోర్సు కూడా మంచి గుర్తింపు పొందింది. ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు టాక్స్ కన్సల్టెంట్లుగా ఉపాధి పొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ మాట్లాడుతూ ఈ అరుదైన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బెల్లంపల్లి ప్రాంతంలోనే అందుబాటులో ఉన్న ఈ కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని ఆయన తెలిపారు. డిగ్రీ పూర్తి కాగానే ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడాలని సూచించారు. కళాశాలలో ఏఈడిపి కోర్సులతో పాటు బిఏ, బీకాం (సిఏ, టాక్సేషన్), బిఎస్సీ (ఎంపీసీ, బిజెడ్సి) వంటి ఇతర కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9959269975 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.




## లోకేశ్వరం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

- దివ్యాంగులకు సహాయక పరికరాల పంపిణీ.. రూ. 100 కోట్లతో అర్లీ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం: ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**భైంసా, జులై 16, ప్రభాతవార్త:**

లోకేశ్వరం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించిన భవిత భవనాన్ని ప్రారంభించి, దివ్యాంగులకు అవసరమైన ఎలక్ట్రికల్ సామగ్రి, ఇతర సహాయక పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో నాబార్డ్ నిధులు రూ. 45.12 లక్షల వ్యయంతో చేపట్టిన అదనపు మౌలిక సదుపాయాల పనులను ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. తర్వాత గోడిసెర గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లోకేశ్వరం మండల ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన అర్లీ బ్రిడ్జి నిర్మాణం త్వరలోనే ప్రారంభం కానుందని వెల్లడించారు. రోడ్డు, వంతెన నిర్మాణానికి కలిపి దాదాపు రూ. 100 కోట్ల నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని, పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. అలాగే పిప్రీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేసి సాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా, ఎలాంటి పక్షపాతం లేకుండా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మండల నాయకులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## కొట్లలో రూ. 30 లక్షల గోదాంకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**- రైతుల ధాన్యం నిల్వకు సౌలభ్యం**

**- బిజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డికేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోంది**

**నిర్మల్, జూలై 16, ప్రభాతవార్త:**

నిర్మల్ మండలం కౌట్ల (కె) గ్రామంలో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ అగ్రికల్చర్ గోదాం నిర్మాణ పనులకు శాసనసభాపక్ష నేత (బిజేఎల్పీ), ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంట ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ గోదాం నిర్మాణం పూర్తయితే స్థానిక రైతులకు ధాన్యం నిల్వ చేసుకోవడంలో ఎంతో సౌలభ్యం కలుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జమాల్, మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, నాయకులు నర్సారెడ్డి, గ్రామ సర్పంచ్ రాజు, సర్పంచ్‌లు కొండ శ్రీనివాస్, గడ్డం హరీష్, భూమేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల సమూల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

**- సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు**

**- చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత స్థాయికి ఎదగాలి: బోథ్ సీఐ డి. గురుస్వామి**

**బజార్‌హత్నూర్, జులై 16, ప్రభాతవార్త:**

మాదకద్రవ్యాల (డ్రగ్స్) సమూల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బోథ్ సీఐ డి. గురుస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో గురువారం మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐ గురుస్వామి మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తులకు బానిసలు కాకూడదని, ఇవి భవిష్యత్తును, కుటుంబాలను నాశనం చేస్తాయని సూచించారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యం క్షీణించి జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, నాడీ వ్యవస్థ దెబ్బతినడం, గుండె జబ్బులు, మానసిక రుగ్మతలు వస్తాయని హెచ్చరించారు. వ్యసనానికి బానిసలైన వారు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా దొంగతనాలు, అప్పుల పాలవుతారని తెలిపారు. పిల్లల ప్రవర్తనలోని మార్పులను తల్లిదండ్రులు గమనిస్తూ, వారితో స్నేహపూర్వకంగా ఉంటూ సరైన మార్గదర్శకత్వం అందించాలని పిలుపునిచ్చారు. ఎస్సై రమేష్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వల్ల కుటుంబంలో మనశ్శాంతి కరువై తగాదాలు ఏర్పడతాయన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువు, ఆటలు, కళల వైపు దృష్టి పెట్టాలని సూచించారు. డ్రగ్స్ అక్రమ రవాణా లేదా వినియోగం ఎక్కడైనా జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. భావి భారత పౌరులైన యువతను డ్రగ్స్ మహమ్మారి నుండి కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వోర్ని వెంకట రమణ, ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# భూముల సర్వే, రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

**బాబూల్ గావ్ గ్రామంలో రీసర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ భవేశ్ మిశ్రా - రైతులు ఆయిల్ పామ్, పంట మార్పిడి విధానాలపై దృష్టి పెట్టాలి**

**నిర్మల్, జూలై 16, ప్రభాతవార్త:**



భూముల సర్వే, రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం భైంసా మండలం బాబుల్ గావ్ గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మ్యాప్‌లు లేని గ్రామాలకు మ్యాప్‌లు తయారు చేసేందుకు చేపట్టిన సర్వేను అత్యంత పారదర్శకంగా చేపట్టాలని స్పష్టం చేశారు. రీసర్వేకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో అత్యాధునిక సాంకేతికత వినియోగించి రీసర్వే ప్రక్రియ చేపట్టిందని, ఈ ప్రక్రియ మొత్తాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులందరూ ఆయిల్ పామ్ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు పొందే వీలుంటుందని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలని, పంట మార్పిడి విధానాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ ఏడీ నరసింహమూర్తి, తహసిల్దార్ శశిభూషణ్, గ్రామ సర్పంచ్ అనసూయ మహేందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గోదావరి నదిలో దూకబోయిన మహిళను

# కాపాడిన స్థానికులు, బాసర పోలీసులు

**- దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగింత**

**భైంసా, జులై 16, ప్రభాతవార్త:**



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న బాసర సీఐ దీపక్, పోలీస్ సిబ్బంది

కుటుంబంలో వచ్చిన చిన్న చిన్న గొడవల కారణంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను బాసర పోలీసులు చాకచక్యంగా కాపాడారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన ఉమాబాయి, భర్త శివాజీ దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి బాసరలోని పవిత్ర గోదావరి నది వద్దకు వచ్చారు. మనస్పర్థల కారణంగా సదరు మహిళ గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించింది. గమనించిన స్థానికులు వెంటనే బాసర పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన బాసర పోలీస్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మహిళను సురక్షితంగా కాపాడారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి బాసర పోలీస్ స్టేషన్‌కు రప్పించారు. బాసర సీఐ దీపక్ భార్యాభర్తలిద్దరికీ విచారణ జరిపి, చిన్న చిన్న గొడవలకు మనస్తాపం చెంది ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారిని కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. సమయానుకూలంగా స్పందించి ప్రాణాలు కాపాడిన బాసర పోలీస్ సిబ్బందిని స్థానికులు, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

# కాసిపేట మండలం వెంకటాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**కమ్యూనిటీ పోలీసింగ్‌కు ఆదర్శం**

**బెల్లంపల్లి, జూలై 16, ప్రభాతవార్త**



కేవలం భద్రతనే కాకుండా సేవా భావంతో సమాజానికి తోడుగా నిలవాలనే లక్ష్యంతో రామగుండం పోలీస్ కమిషనరేట్ మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మంచిర్యాల జోన్ కాసిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో దేవాపూర్ పోలీసులు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం గ్రామంలో సేవా పండుగలా మారింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా కు గ్రామ మహిళలు సంప్రదాయబద్ధంగా ఇచ్చిన స్వాగతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తిలకం, తలపాగా, పూలమాలలతో సత్కరించి, గిరిజన కళారూపాలతో వేదికకు ఆహ్వానించడం ద్వారా గ్రామ సంస్కృతి సొబగులు వెలుగుచూశాయి. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసింగ్ అంటే కేవలం చట్ట అమలు కాదు.. ప్రజలతో అనుబంధం, బాధ్యత కూడా అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, రవాణా రంగాల్లో వచ్చిన మార్పులు అభినందనీయమని, ప్రజలు ఐక్యంగా ఉంటే అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని తెలిపారు. యువతపై ప్రత్యేకంగా దృష్టి సారించిన సీపీ, మత్తు పదార్థాలు జీవితాన్ని చెడగొడతాయి.. కుటుంబాన్ని దెబ్బతీస్తాయి అంటూ హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అదే సమయంలో రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ, హెల్మెట్ వినియోగం, చెల్లుబాటు అయ్యే లైసెన్స్, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదనే అంశాలను గట్టిగా ప్రస్తావించారు. ఈ వైద్య శిబిరం ద్వారా గ్రామ ప్రజలకు నగర స్థాయి వైద్య సేవలు అందించడం విశేషం. పల్మనాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, కంటి వైద్యం తదితర విభాగాలకు చెందిన నిపుణులు సేవలందించారు. బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, అల్ట్రాసౌండ్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించడం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది.



ప్రజల ఆరోగ్యం – పోలీసుల బాధ్యత అనే భావనతో నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామ ప్రజలలో మంచి స్పందన పొందింది. వైద్య సేవలందించిన డాక్టర్లను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ పి. రమేష్, ఎస్ఐలు గంగారం, ఆంజనేయులు, నరేష్, శ్రీధర్, అలాగే మెడీలైఫ్, సన్‌రైజ్ హాస్పిటల్స్ వైద్యులు, గ్రామ పెద్దలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల జోలికెళ్తే దాడులు తప్పవు..

**- బీజేపీ నేత కొయ్యల ఏమాజీ హెచ్చరిక**

**బెల్లంపల్లి, జూలై 16, ప్రభాతవార్త**



రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీశాఖ అధికారులు జోక్యం చేసుకుంటూ వేధింపులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బీజేపీ రాష్ట్ర నేత, జడ్పీటీసీల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజీ హెచ్చరించారు. గురువారం నెన్నెల మండలం నెన్నెల శివారులోని సర్వే నంబర్లు 671, 672 పరిధిలో ఉన్న సుమారు 1500 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ భూముల్లో గత ముప్పై ఏళ్లుగా అనేక మంది రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. అప్పట్లో ప్రభుత్వమే వారికి పట్టాలు మంజూరు చేసిందని, అప్పటి నుండి నిరంతరం సాగు కొనసాగుతోందని వివరించారు. అయితే ఇటీవల అటవీశాఖ అధికారులు ఈ భూముల్లో జోక్యం చేసుకుని రైతులపై తప్పుడు కేసులు నమోదు చేసి, కొందరిని జైలుకు పంపిస్తున్నారని ఏమాజీ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను పొలాల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకోవడం వల్ల పేద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు చట్టబద్ధ హక్కులు ఉన్నప్పటికీ అటవీశాఖ అధికారులు అడ్డంకులు సృష్టించడం శోచనీయమని పేర్కొన్నారు. వెంటనే ఈ వేధింపులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బాధిత రైతులతో కలిసి అటవీశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి భూములను పరిశీలించిన కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కేశవరెడ్డి, శైలేందర్ సింగ్, గోవర్ధన్, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. అలాగే రైతు కూలీ సంఘం నాయకులు రత్నం తిరుపతి, బనేష్, శివలింగయ్య, మొహిద్ ఖాన్, గంగారాం, సునీత, బొండయ్య తదితరులు హాజరయ్యారు.



బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు, భక్తులు

## ఘనంగా పోచమ్మ బోనాలు

**తాండూర్, జూలై 16, ప్రభాతవార్త :**

మండలంలోని అచ్చలాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెంలో గురువారం ఘనంగా పోచమ్మ బోనాలు నిర్వహించారు. కొత్తగా నిర్మించిన పోచమ్మ గుడి వద్దకు డప్పు, చప్పుల శివసత్తుల నృత్యాలు మధ్య మహిళలు, భక్తులు అధిక సంఖ్యల తరలి వెళ్లి అమ్మవారికి కానుకలు, నైవేద్యాలు, మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, తమ కుటుంబాలను చల్లగా చూడాలని మహిళలు పూజలు చేశారు. పోచమ్మ బోనాలతో గ్రామంలో, పోచమ్మ ఆలయం వద్ద పండుగ వాతావరణం నెలకొంది.



సంతోష్ చారిని సన్మానిస్తున్న విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు

## విశ్వకర్మ సంఘం బలోపేతానికి కృషి

**ఆసిఫాబాద్ టౌన్ , జూలై16, ప్రభాతవార్త**

విశ్వకర్మ సంఘ బలోపేతానికి తన వంతుకృషి చేస్తానని అచల భారత విశ్వకర్మ మహసభ రాష్ట్ర అధ్యక్షులడు సంతోష్ చారి పేర్కొన్నారు. విశ్వకర్మ సంకల్పయాత్రలో భాగంగా గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన విలేఖరులతో మాట్లాడారు. మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న విశ్వకర్మ కుటుంబాలను కలిసి వారి సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం స్థానిక బ్రహ్మంగారి ఆలయంలో విశ్వబ్రహ్మణ సంఘం అధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు వెంకటయ్య, భాస్కరచారి, సురేష్ చారి, తిరుపతిచారి, వేణుగోపాల్, కిషోర్, రాధాకృష్ణచారి, వినోద్, రవి, వెంకటచారి తదితరులు పాల్గొన్నారు

## గిరిజన గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో అకాడి పండుగ

**లింగాపూర్, జులై 16 ,ప్రభాతవార్త,**

లింగాపూర్ మండలంలో జముల్దార గ్రామంలో గ్రామస్తులందరు కలసి పాడి పశువులు అడవిలో మేతకు వెళ్ళి క్షేమంగా తిరిగి రావాలని, వనదేవతలకు భక్తి శ్రద్దలతో గ్రామస్తులందరూ కలిసి నైవేద్యాలు సమర్పించి. పంటలు సమృద్ధిగా పండాలని గ్రామస్తులందరూ మన దేవతలను కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జగ్నక మారుతి, జగ్నక యశ్వంత్,జగ్నక రాము, సలాం రవికుమార్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వన దేవతలకు పూజలు నిర్వహిస్తున జముల్దార గ్రామస్తులు

## ప్రాణాల కంటే రాజకీయాలు గొప్పవా?

**- సోనం వాంగ్చుక్‌తో చర్చలు జరిపి దీక్ష విరమింపజేయాలి**

**- నీట్ వైఫల్యంపై కేంద్ర విద్యా మంత్రి బాధ్యత వహించాలి**

**- ప్రజాసంఘాల డిమాండ్**

**మంచిర్యాల, జూలై 16, ప్రభాతవార్త**

దేశ రాజధానిలో నిరాహార దీక్ష కొనసాగిస్తున్న సోనం వాంగ్చుక్‌తో కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి దీక్ష విరమింపజేయాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ఉద్యమకారుల డిమాండ్లను దేశద్రోహం పేరుతో కొట్టిపారేయకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు, సామాజిక ఉద్యమకారులు, వివిధ వేదికల ప్రతినిధులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.





రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ వెంకటేష్

## రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి

**తాండూర్, జూలై16, ప్రభాతవార్త :**

ఎల్ నినో నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని తాండూర్, కిష్టంపేట సెక్టార్ల ఏఈఓలు వెంకటేష్, రాకేష్ అన్నారు. మాదారం, కిష్టంపేట గ్రామాలలో గురువారం రైతులకు ప్రత్యామ్నయ పంటల సాగుపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్ నీ నో ప్రభావం వలన వర్షాలు తక్కువ పడుతున్న కారణంగా రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలన్నారు. మినుములు, పెసర, కంది, కూరగాయలు, జొన్న, రాగులు వంటి పంటలను పండించుకోవాలన్నారు.పంట వైవిధ్యం ద్వారా ఆదాయం పెరగడమే కాకుండా భూసారాన్ని కూడా కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి నష్టాలు తగ్గించుకోవాలని సూచించారు.

## 17న జిల్లాకు రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ చైర్మన్, సభ్యుల రాక

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్, జూలై 16, ప్రభాతవార్త :**

ఈ నెల 17న రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులతో కలిసి జిల్లాకు రానున్నారని జిల్లా కలెక్టర్ కె.హరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని, అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

# 20న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

**తాండూర్, జూలై 16, ప్రభాతవార్త :**

ఈనెల 20న నిర్వహించ తలపెట్టి చలో కలెక్టరేట్ కు భవన నిర్మాణ, ఇతర కార్మికులు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారం కోరారు. చలో కలెక్టరేట్, ధర్నాకు సంబంధించిన కరపత్రాలను గురువారం సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంఘటిత అసంఘటిత రంగ కార్మికులను మోసం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన జీవో నెం.12 ను రద్దుచేసి వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రభుత్వమే అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బొల్లం రాజేశం, చదువుల వెంకటేశం, సాలిగామ పోశం, పూదరి స్వామి, రేవెల్లి ఉమాశంకర్, ఉప్పుట్ల శంకర్, అభి, రాజు, ఇప్ప శంకర్, తదితరులు పాల్గొన్నారు.



చలో కలెక్టరేట్ కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు